# సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: మేయర్



కరీంనగర్, మార్చి 24: నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరగబోయే సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు నగరపాలక సంస్థ ద్వారా సమగ్ర ఏర్పాట్లు చేపడుతున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 15వ డివిజన్ చింతకుంటలోని హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన మేయర్, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ నిధులతో నూతన బోర్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్‌తో కలిసి భూమిపూజ చేశారు. తదనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్, సానిటేషన్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ నవమి పర్వదినాన నిర్వహించే సీతారాముల కళ్యాణ మహోత్సవాల ఏర్పాట్లు, పారిశుధ్య కార్యక్రమాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మేయర్ మాట్లాడుతూ 27వ తేదీన జరగబోయే మహోత్సవాలకు నగరంలోని అన్ని 66 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, కలుపు మొక్కలు, చెత్త తొలగించడంతో పాటు అవసరమైన చోట చదును పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, అన్నదాన కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. కళ్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

అదనంగా నగర పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి రోజు డోర్ టూ డోర్ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, స్వచ్ఛ ఆటోలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, ఎంహెచ్ఓ సుమన్, డీఈలు, ఏఈలు, సానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# షహీద్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులు

కరీంనగర్, మార్చి 23: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలను అర్పించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లకు షహీద్ దివస్ సందర్భంగా కరీంనగర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటాలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భగత్ నగర్ చౌరస్తాలోని భగత్ సింగ్ విగ్రహానికి కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 23 ఏళ్ల వయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు సమానత్వం కలిగిన సమాజం కోసం పోరాడారని అన్నారు. భగత్ సింగ్ కేవలం విప్లవకారుడే కాక గొప్ప మేధావి అని, యువత ఆయన ధైర్యం, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని, ఆ స్వేచ్ఛను కాపాడుకోవడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, అపర్ణ, జితేందర్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, కొమురయ్య, పొన్నం లక్ష్మి మొండయ్య తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

బావుపేట, మార్చి 23: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ బావుపేట గ్రామంలో సైబర్ నేరాలు మరియు మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐపీఎస్ అధికారి సోహం సునీల్, సి.ఐ. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. సోహం సునీల్ మాట్లాడుతూ టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయని, గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని నేరరహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజనేయులు, ఉప సర్పంచ్ కర్ణాకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు అందరూ కలసి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు... సామాజిక సేవ శిక్ష విధించిన కోర్టు



కరీంనగర్, మార్చి 23: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిపై కరీంనగర్ కోర్టు వినూత్న శిక్ష విధించింది. జరిమానా చెల్లించకపోవడంతో వారిని సామాజిక సేవ చేయాలని ఆదేశించింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పోలీసులకు చిక్కిన ఇద్దరు వ్యక్తులపై II స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ ఈదుల లక్ష్మి విచారణ జరిపి ఈ మేరకు తీర్పు ఇచ్చారు. రాజస్థాన్‌కు చెందిన తేజ్ సింగ్ (35) మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా రూ.2,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేకపోవడంతో ఆయనకు 3 రోజుల పాటు సామాజిక సేవ శిక్ష విధించారు. అలాగే తిమ్మాపూర్‌కు చెందిన బోనాల సాయికృష్ణపై రూ.5,000 జరిమానా విధించడంతో పాటు 6 రోజుల పాటు సామాజిక సేవ చేయాలని కోర్టు ఆదేశించింది. ఇద్దరూ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఈ శిక్షను అనుభవించనున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసం రూపొందించబడ్డాయని, వాటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వాగేశ్వరీ కళాశాలకు ఎన్బీఏ... ఫార్మసీకి అటానమస్ హోదా



తిమ్మాపూర్, మార్చి 22 (జనతా న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని వాగేశ్వరీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్బీఏ) లభించినట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. కళాశాలలోని సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ విభాగాలకు ఎన్బీఏ గుర్తింపు వచ్చినట్లు వాగేశ్వరీ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ గంగ్ర శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు మూడేళ్లపాటు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలోనే తమ కళాశాలకు ఇప్పటికే నాక్ ఏ ప్లస్ గుర్తింపు లభించిందని, ఇప్పుడు ఎన్బీఏ రావడం గర్వకారణమని అన్నారు. 2023లో నాక్ ఏ ప్లస్, 2025లో అటానమస్ హోదా లభించగా, తాజాగా ఎన్బీఏ రావడం విద్యా ప్రమాణాలకు నిదర్శనమని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ కృషి కీలకమని, సీనియర్ అధ్యాపకులతో విద్యార్థులకు ఆధునిక బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు.

### ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

వాగేశ్వరీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి జేఎన్టీయూ ద్వారా అటానమస్ హోదా లభించినట్లు డాక్టర్ గంగ్ర శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉత్తర తెలంగాణలోనే ఫార్మసీ విభాగంలో ఈ గుర్తింపు రావడం ప్రత్యేకమన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా మరింత కృషి చేస్తామని, భవిష్యత్తులో ఫార్మసీ విభాగానికి కూడా ఎన్బీఏ గుర్తింపు సాధించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ద్యావ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్లు విశ్వనాథ్, వినోద్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## చెత్త విభజనతోనే పట్టణ పరిశుభ్రత

### మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల స్వచ్ఛతను కాపాడటంలో భాగస్వాములు కావాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఐదో వార్డు హనుమాన్ నగర్‌లో చెత్త విభజనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని కోరారు. ఇళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను తడి, పొడి రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. తడి చెత్తతో విలువైన సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడం ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని వివరించారు. అనంతరం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తయారు చేసిన సేంద్రియ ఎరువును వార్డు ప్రజలకు చూపిస్తూ, మొక్కల పెంపకంలో దాని ప్రాముఖ్యతను వివరించి పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బొలిశెట్టి రాజు, పిల్లి తిరుపతి, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డ్ ఆర్.పి వాణిశ్రీ, అంగన్వాడీ టీచర్ తిరుమల, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, పాల్గొన్నారు.

## విశ్వకర్మ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలి..



హుస్నాబాద్,జనత న్యూస్:విశ్వకర్మల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలని, తక్షణమే విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి వెయ్యి కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2009లో ప్రవేశపెట్టిన కార్పొరేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు, కులవృత్తులపై ఆధారపడిన విశ్వకర్మలకు ఆధునిక యంత్రాలను అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే నిరుపేద విశ్వకర్మలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. 2004లో హామీ ఇచ్చిన విధంగా ఎన్పీడీసీఎల్ ద్వారా 25 హెచ్‌పీ వరకు ఫోర్త్ కేటగిరీ విద్యుత్ సౌకర్యాన్ని తక్షణమే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సామెల్ అసోసియేషన్ అధ్యక్షులు మాటూరి విద్యాసాగర్, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఒగ్గోజు వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పోలోజు శ్రీకాంతాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను బకాయిలపై కఠిన చర్యలు.. కోచింగ్ సెంటర్ సీజ్

కరీంనగర్, మార్చి 24: నగరపాలక సంస్థకు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని కోచింగ్ సెంటర్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 51వ డివిజన్ పరిధిలో కోర్టు సమీపంలో ఉన్న 3-1-777, 3-1-3777/1, 3-1-3778, 3-1-778/1 హౌస్ నంబర్లలో నడుస్తున్న కోచింగ్ సెంటర్‌ను సోమవారం డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్ తనిఖీ చేశారు. ఆస్తిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత కోచింగ్ సెంటర్‌కు తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. పన్నులు చెల్లించని పక్షంలో వ్యాపార సంస్థలను సీజ్ చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫోర్ లైన్ రోడ్డు పనులపై కలెక్టర్ పరిశీలన



కరీంనగర్, మార్చి 23: మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లి వద్ద కొనసాగుతున్న ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వీస్ రోడ్డు నిర్మాణంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డు పనుల వల్ల గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

**కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సూచనలు**



కరీంనగర్, మార్చి 23: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి, విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని, తాగునీరు, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో సరైన గాలి ప్రసరణ ఉండేలా, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**అడిషనల్ కలెక్టర్ తనిఖీ**

ఇక హౌసింగ్ బోర్డు కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

# ప్రజావాణికి 28 ఫిర్యాదులు.. త్వరిత పరిష్కారానికి చర్యలు

కరీంనగర్, మార్చి 24: కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో పలు విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 28 దరఖాస్తులు స్వీకరించగా, అందులో ఇంజనీరింగ్ విభాగానికి 5, టౌన్ ప్లానింగ్‌కు 15, ఇందిరమ్మకు 1, సానిటేషన్‌కు 1, రెవెన్యూ విభాగానికి 6 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణీ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్ తెలిపారు.

# హుస్నాబాద్‌కు రాత్రి బస్సు లేక ప్రయాణికుల ఇబ్బందులు

**బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్**



హుస్నాబాద్,జనత న్యూస్: హనుమకొండ నుండి హుస్నాబాద్‌కు రాత్రి 9 గంటలకు బస్సు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం సాయంత్రం 7:30 తర్వాత బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రైలు ప్రయాణికులు, పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటూ లాడ్జీలలో డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు.అదేవిధంగా హుస్నాబాద్ డిపో నుంచి అదిలాబాద్‌కు నడిచే కొత్త బస్సులను హనుమకొండ మార్గం బదులుగా కరీంనగర్ మార్గంలో నడపాలని సూచించారు. బస్సుల సమయాల్లో అసమానతలు ఉండటంతో కొన్ని సమయాల్లో వరుసగా బస్సులు వెళ్లి, తర్వాత ఖాళీ ఏర్పడుతోందని, కనీసం అర్ధగంట వ్యవధిలో బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.తిరుపతి, భద్రాచలం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు కూడా హుస్నాబాద్ డిపో నుంచి బస్సులు నడపాలని స్థానికులు కోరుతున్నారని రవీందర్ గౌడ్ తెలిపారు.

# సీతారామ కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి: కలెక్టర్



కరీంనగర్, మార్చి 23: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 27న నిర్వహించే సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. సోమవారం ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష చేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, క్యూ లైన్లు, మొబైల్ టాయిలెట్లు, టెంట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులు చదును చేసి గుంతలు లేకుండా చూడాలని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ దీపాలు, తాగునీటి ట్యాంకర్లు, అంబులెన్సులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ ఢ బి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పని చేసి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. కలెక్టర్ స్వయంగా కళ్యాణం జరిగే ప్రదేశాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వేలాది మంది భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీఓ రమేష్ బాబు, డీఎస్పీ మాధవి, కమిషనర్ ఆయాజ్, ఆర్ ఢ బి ఈఈ నరసింహచారి, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్‌లో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమం




కరీంనగర్, మార్చి 23: ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు మహమ్మద్ బషీరుద్దీన్, మహమ్మద్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. హిందూ, ముస్లిం సమాజాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సోదరభావం, సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ సందర్భంగా శాంతి, ఐక్యత, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రోత్సహిస్తూ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మహమ్మద్ బషీరుద్దీన్, మహమ్మద్ అజారుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## సాయిబాబా సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లకు ఘన సన్మానం



కరీంనగర్, మార్చి 24: కరీంనగర్‌లోని సాయిబాబా సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపెల్లి శ్రీలేఖ జితేందర్, ఇతర డివిజన్ కార్పొరేటర్ దేశ శిల్ప వేదంలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్సంగ్ బాధ్యులు మాట్లాడుతూ సన్మానిత కార్పొరేటర్లకు తమ తమ డివిజన్ల సమస్యలపై అవగాహన ఉందని, వారి నాయకత్వంలో ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం కార్పొరేటర్లు మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకారపు భాస్కర్ రెడ్డి, అన్నాది అజిత్ రావు, రాజేందర్ రావు, సదానందం, ఉప్పుల అంజనీ ప్రసాద్, జక్కుల ప్రకాష్, నరోత్తం రెడ్డి, గాడగొని రమేష్ గౌడ్, బండారి శ్రీనివాస్, కొంగల రాజిరెడ్డి, నర్సింహా రెడ్డి, గాయత్రి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## 'చలో అసెంబ్లీ'కు వెళ్తున్న బీజేపీ నేతల అరెస్ట్



కరీంనగర్, మార్చి 24: 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి తరలివెళ్తున్న బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా నాయకులు కార్యక్రమానికి బయలుదేరగా, పోలీసులు జోక్యం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాసును పట్టణ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శాంతియుతంగా కార్యక్రమానికి వెళ్తున్న తమను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదని అన్నారు. రెండున్నరేళ్లు గడిచినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ముఖ్యంగా ఆరు గ్యారంటీలు అమలు కాలేదని విమర్శించారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు తగిన నిధులు కేటాయించలేదని, రాష్ట్రంలో అవినీతి, కమిషన్ల పాలన కొనసాగుతోందని ఆరోపించారు.

## టీపీఎస్ ఏర్పాటుకు కలెక్టర్ పరిశీలన



రాజన్న సిరిసిల్ల, మార్చి 23: తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో స్కూల్, జూనియర్ కళాశాల కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య, గదుల సంఖ్య, విస్తీర్ణం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాల గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడేది లేదు: ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి



తిమ్మాపూర్, మార్చి 24: ప్రజల సమస్యల కోసం పోరాడే బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసినా భయపడేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ఇచ్చిన 'చలో అసెంబ్లీ' పిలుపు నేపథ్యంలో సోమవారం ఉదయం తిమ్మాపూర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఎల్ఎండీ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అమలుకాని హామీలు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న కార్యకర్తలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రజల కోసం ఎంతటికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, మాజీ ఎంపీటీసీ ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**అమరవీరులకు ఘన నివాళులు**

స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ మార్చి 23న ఈ ముగ్గురు అమరవీరులను బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసిన రోజునే 'షహీద్ దివస్'గా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారి త్యాగాలు అమూల్యమైనవని, యువత వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com